చుక్కపల్లి, నీలంపేట గ్రామాలలో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర - చీడికాడ: మండలంలోని చుక్కపల్లి, నీలంపేట గ్రామాలలో వ్యవసాయ అధికారిణి ఏ.కృష్ణవేణి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణం పరిస్థితిలో వరి పంటలో మాని పండు తెగులును గమనించి నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. జీడి మామిడి పంట ఉన్న రైతులు ఎకరాకు 1540 చెల్లించి భీమ చేయించుకోవాలన్నారు. దీని ద్వారా ప్రకృతి వైపరీత్యాల వలన నష్టపోయిన పంటలకు ప్రభుత్వం బీమా నగదును చెల్లిస్తుందన్నారు. పీఎం కిసాన్ పథకానికి సంబంధించి యన్‌పీసీఐ చేయించుకోవాలన్నారు. దీని ద్వారా పీఎం కిసాన్ నగదు రైతులకు వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎంఎం రంగనాథ్, కే.దేవతల్లి రైతులు పాల్గొన్నారు.

సబ్బవరం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి (సబ్బవరం): వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సబ్బవరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీకి పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, సబ్బవరం ఇన్స్పెక్టర్ పి.రమణలు పూల మొక్కలను అందజేసి సాధారణంగా ఆహ్వానం పలికారు. అనంతరం ఎస్పీ సిబ్బంది నుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల ముఖ్యంగా నిరుపేదలు, వృద్ధులు, మహిళలు సమస్యలు తెలుసుకుని పరిష్కార దిశగా సహకరించాలన్నారు. బేసిక్ పోలీసింగ్ నిర్వహించాలని, విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాలు నియంత్రించేందుకు ఎన్ఫోర్స్మెంట్ కేసులు నమోదు చేయాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, నాటు సారా తయారీపై పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాల కట్టడికి ఆకస్మిక/ డైనమిక్ తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. మాదకద్రవ్యాలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ క్రైమ్స్ గూర్చి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తరుచు రిపోర్ట్ అవుతున్న నేరాలు గురించి ఆరా తీశారు. పెండింగ్ కేసుల సీడీ ఫైల్స్‌ను పరిశీలించి, ఆయా కేసుల పురోగతిని తెలుసుకుని తగు సూచనలు ఇచ్చారు. రౌడీ షీటర్స్, చెడునడత కలిగిన వ్యక్తుల వివరాలు తెలుసుకుని, వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులు గూర్చి ఆరా తీశారు. ఎస్సైలు సింహాచలం, దివ్య సిబ్బంది ఉన్నారు.

కైలాసపట్నంలో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర - కోటవురట్ల: వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం కైలాసపట్నం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు కోలా రమేష్ సాగు చేస్తున్న వ్యవసాయ భూములోకి వెళ్లి వరి పంటను పరిశీలించారు. అనంతరం వరి పంట పొట్ట దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంట దిగుబడి, గింజ నాణ్యతపై వ్యవసాయ శాఖ సిబ్బంది రాణి రైతులకు అవగాహన కల్పించారు. ఇతర పంటలు సాగు చేసే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై కమీషన్ వేసే అధికారం రాష్ట్రానికి లేదు - సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని డిమాండ్

విశాలాంధ్ర - దేవరాపల్లి: ఎస్సీ వర్గీకరణపై కమిషన్ వేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని, వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని మండల ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ డిమాండ్ చేసింది. మండల ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు కాటపల్లి అప్పారావు అధ్యక్షతన మంగళవారం మండల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ పేరుతో ఎస్సీ ఉమ్మడి ఉప కులాల మధ్య చిచ్చుపెట్టే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని దుయ్యబట్టారు. రాజకీయ లబ్ధి కోసం వర్గీకరణ చేస్తే ఐక్యంగా పోరాడి, హక్కులు సాధించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీలకు ఉన్న రిజర్వేషన్ శాతాన్ని పెంచి, ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. గత ప్రభుత్వం రద్దు చేసిన ఎస్సీ, ఎస్టీల సంక్షేమ పథకాలను కుటమి ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ఎస్సీ ఉమ్మడి కార్పొరేషన్ ఏర్పాటు చేసి యువతకు రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మచ్చ వీర్రాజు, సబ్బవరపు మాలిబాబు, మల్లేటి బుజ్జులు, కంచిమాల అప్పారావు, దువ్వాడ రమేష్, మచ్చ రామారావు, ఉల్లి శ్రీను, మల్లేటి అర్జున, ఉల్లి పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ సాంబశివుని శూలాల మహోత్సవం

విశాలాంధ్ర - మునగపాక: మండల కేంద్రమైన మునగపాక శ్రీ సాంబశివుని శూలాల మహోత్సవం అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెలవారుజాము నుండే జిల్లా నలుమూలాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి సాంబశివున్ని దర్శించుకున్నారు. రాత్రి 10 గంటల నుండి సాంబశివుని భక్తులు శూలాలు ధరించి ఆలయం నుండి బయలుదేరారు. శివునికి రక్తతర్పణం చేస్తూ బుగ్గలకు, నాలుకకు, శరీరమంతా ఇనుప చువ్వలతో శూలాలు ధరించి డప్పు వాయిద్యాలతో నృత్యం చేస్తూ శూలాల ప్రదర్శన నిర్వహించారు. మునగపాక పురవీధుల్లో ప్రదర్శనగా శూలాల మహోత్సవాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఊరేగింపులో సేవగరిడి, అమ్మవారి డాన్సులు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రధాన వీధిలో డాన్స్ బేబీ డాన్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి భక్తులకు కనువిందు కలిగించారు. శ్రీ సాంబశివుని జనసేన పార్టీ ఉత్తరాంధ్ర ముఖ్య ప్రతినిధి సుందర సతీష్ కుమార్, అనకాపల్లి మాజీ జిల్లా వైసీపీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, రాష్ట్ర టీడీపి కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, మండల టీడీపి అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, మండల జనసేన అధ్యక్షులు టెక్కలి పరశురామ్, మండల వైసీపీ అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చియ్యనాయుడు, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు భీమరశెట్టి శ్రీనివాసరావు, యలమంచిలి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పెంటకోట విజయ్, గ్రామ సర్పంచ్ దిమ్మల అప్పారావు, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై ప్రసాదరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవంలో వేలాదిమంది భక్తులు పాల్గొని విజయవంతం చేశారు.

అధికారులతో సమావేశమైన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర - నాతవరం: నాతవరం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా ట్రైబల్ స్పెషల్ ఆఫీసర్ నాగశిరిషా, ఇన్చార్జ్ ఎంపీడీవో కె.ఉషశ్రీ, తహశీల్దార్ వేణుగోపాల్‌తో టీడీపీ నాయకులు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాతవరం మండల టీడీపీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, అనకాపల్లి పార్లమెంటు ఉపాధ్యక్షుడు కరక సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, ఇసుక తరలింపు విషయంలో సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే పరిమితం చేయాలని, ప్రతి ట్రాక్టర్‌కు ఉచిత ఇసుక బేనర్‌లో పోటోలు ఆంధ్రప్రదేశ్ సిఎం నారా చంద్రబాబు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడులవి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ తాండవ చైర్మన్ పారుపల్లి కొండబాబు, ఎంపీపీలు సింగంపల్లి సన్యాసిదేముడు, నేతల విజయ్ కుమార్, ఎంపీటీసీ అవిరెడ్డి మాణిక్యం, మండల ఐటీడిపి ఇన్చార్జ్ శెట్టి గోపి, వనిమిన రామకృష్ణ, జ్యోతిబాబు, తానారి దాసు, పినిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక దత్తత సంస్థను ప్రారంభించిన కలెక్టర్

విశాలాంధ్ర - అనకాపల్లి: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగంలో గల ప్రత్యేక దత్తత సంస్థను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ ప్రత్యేక దత్తత సంస్థ నందు 0 నుండి 6 సంవత్సరాల వయస్సు మధ్య కలిగిన (తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు, వదిలి వేయబడిన పిల్లలు, తల్లిదండ్రులు బిడ్డను పెంచుకోలేక సంస్థకు అప్పగించిన పిల్లలు) వీరి కోసం ఈ సంస్థ 24 గంటలు పనిచేస్తుందన్నారు. ఈ సంస్థ నందు మేనేజర్, సామాజిక కార్యకర్త, ఏ.ఎన్.ఎం, ఆయాలు చౌకీదార్ సిబ్బందిగా పనిచేస్తుంటారన్నారు. ఈ సంస్థ నందు గల పిల్లలను కేంద్ర దత్తత వనరుల సంస్థ ద్వారా పిల్లలు లేని వారు దత్తత కొరకు దరఖాస్తు చేసుకొన్న వారికి దత్తత యిచ్చుట కొరకు పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ

సాధికారిత అధికారి కె.అనంతలక్ష్మి, అనకాపల్లి, సమగ్ర శిశు అభివృద్ధి పథక అధికారిణి పి.ప్రభావతి, నోడల్ ఆఫీసర్ ఎల్.సుజాత, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

విశాలాంధ్ర - అనకాపల్లి: వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించుటకు, పంటలకు వచ్చే చీడపీడలు, తెగుళ్ళ, పోషక లోపాలను ముందుగా గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని విజయవాడ కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం సస్యరక్షణ అధికారి కె.వీరయ్య చౌదరి తెలిపారు. మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ పెస్ట్ సర్విజిలెన్స్ సిస్టమ్ యాప్‌పై అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల వ్యవసాయ అధికారులు, రైతులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం స్థానిక గ్రామీణ వ్యవసాయ పరిశోధనా కేంద్రం (ఆర్ఏఆర్ఎస్)లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం సస్య రక్షణ అధికారి కె.వీరయ్య చౌదరి ఎన్.పి.ఎస్.ఎస్. యాప్ ప్రయోజనాలు, యాప్‌ని ఉపయోగించడంపై అవగాహన కల్పించారు. చీడపీడలు, తెగుళ్లను, పోషక లోపాలను పొలాల్లో రైతులు స్వయంగా ఎలా గుర్తించవచ్చునో తెలియజేశారు. ఈ యాప్ వినియోగంపై సమగ్ర శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయ అధికారి ఎమ్మెస్ వసంత్ కుమారి మాట్లాడుతూ రైతులందరూ ఈ యాప్‌ని ఉపయోగించడం వలన జరిగే లాభాలను వివరించారు. ప్రతి రైతు వారి పంటల వివరాలను ఈ యాప్‌లో నమోదు చేసుకొని సూచనలు, సలహాలు పొందవచ్చునని తెలిపారు. అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా.ముకుందరావు మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతులలో రైతులకు ఈ యాప్ ద్వారా సలహాలు, సూచనలు అందుతాయన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం, సహాయ వ్యవసాయ సంచాలకులు వి.శ్రీధర్, భూ సంరక్షణ సహాయ వ్యవసాయ సంచాలకులు కె.మురళి, ఏ.యస్.ఆర్. జిల్లా వ్యవసాయఅధికారి ఏవో సూర్య ప్రకాష్, విశాఖపట్నం వ్యవసాయ అధికారి సుబ్రహ్మణ్యం, విజయవాడ సహాయ కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు, కె.సురేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

16న మహా ధర్నాను జయప్రదం చేయండి: కోన లక్ష్మణ్

విశాలాంధ్ర - అనకాపల్లి: రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికల ముందు ప్రస్తుత సిఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న విజయవాడలో జరిగే మహా ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ ఆటో డ్రైవర్లకు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో పలు ఆటో స్టాండ్స్ వద్ద సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా ఆటో అండ్ మోటార్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా డ్రైవర్లను మోసం చేస్తుందని మండిపడ్డారు. ఇప్పటికైనా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఆటో మోటార్ కార్మికులకు ఇచ్చిన వాహన మిత్ర 15 వేల రూపాయల హామీను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో మోటార్ కార్మికులపై వేస్తున్న ఆర్థిక భారాలను ఆపాలని, డ్రైవర్లందరికీ పిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, భారీగా పెంచిన డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్, విద్యుత్ చార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించి ఆటో డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నూకరాజు, గోలగాని చిన్న, బి.బాబీ, మహేష్, అప్పారావు, మంత్రి సత్తిబాబు, సైదులు, అప్పారావు స్వామి, రాము, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట: ఈ నెల 16న విజయవాడలో జరిగే మహా ధర్నా కార్యక్రమం చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ ఆటో డ్రైవర్లకు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని సీతయ్య పేట శ్రీ దుర్గాంభ వాణి ఆటో స్టాండ్స్ వద్ద డ్రైవర్స్ సమావేశంలో లక్ష్మణ మాట్లాడారు. ఆటో మోటార్ కార్మికులకు ఇచ్చిన వాహన మిత్ర 15 వేల రూపాయలు హామీను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గా భవాని ఆటో సంఘం కార్యదర్శి పిల్ల రాజు, ఇందుల రాంబాబు, కరగని రాజ బాబు, కె.రవి, వి.బంగారు రాజు, ఎం.సురేష్ పాల్గొన్నారు.

బీఎస్సీ, జీఎన్ఎం విద్యార్థులకు జర్మనీ భాషపై శిక్షణ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: బీఎస్సీ, జీఎన్ఎం చదువుతున్న విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపి ఎస్ఎస్డిసి), ఒంకాప్ ద్వారా జర్మనీ భాష నేర్పించి జర్మనీ దేశంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందే అభ్యర్థులు జర్మనీ దేశంలో పనిచేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. అలాగే 35 సంవత్సరాల వరకు వయస్సు ఉండాలని, బీఎస్సీ నర్సింగ్ చేసిన వారికి 2 సంవత్సరాలు, జీ.ఎన్.ఎం నర్సింగ్ చేసిన వారికి 3 సంవత్సరాల అనుభవం ఉండాలని తెలిపారు. అలాగే ఆరు నెలల పాటు రోజుకి ఏడు గంటల చొప్పున గుంటూరులో రెసిడెన్స్ స్కాలర్ విధానంలో శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. శిక్షణ సమయంలో జర్మనీ బాషలో ఏ1, ఏ2, బి1, బి2 స్థాయికి శిక్షణ ఇవ్వబడు తుందన్నారు. శిక్షణ సమయంలో 75,000 కాష్ డిపాజిట్ చెల్లించాలని, డబ్బు చెల్లించలేని పక్షంలో ప్రత్యా మ్నాయంగా అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను సబ్మిట్ చెయ్యాల్సి ఉంటుందన్నారు. ఈ డిపాజిట్లు/సర్టిఫికెట్లను సమర్పించడం అభ్య ర్థులు తమ శిక్షణ సమయంలో గైర్హాజరు కాకుండా ఉండటానికి, కోర్సు నుండి తప్పుకోవడాన్ని నివారించడం కోసమని తెలిపారు. శిక్షణ విజయవంతంగా ముగించుకున్న అభ్యర్థులు జర్మనీ వీసా పొందిన తర్వాత ఆ డిపాజిట్ తిరిగి చెల్లించబడుతుందని తెలిపారు.

జర్మనీలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సుమారు 2400 యూరోల నుండి 3500 యూరోల వరకు (భారత కరెన్సీలో సుమారు రూ.2, 33,000 నుండి రూ.3,26,000 వరకు) వేతనాలు లభిస్తాయన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈ నెల 24వ తేదీ వరకు గడువు ఉందని, డిసెంబర్ 1వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభిం చడం జరుగుతుందని, పూర్తి సమాచారం కోసం 9988853335 సంప్రదించాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తెలిపారు.

గంజాయి కేసులో ముద్దాయికి కఠిన కారాగార శిక్ష

విశాలాంధ్ర - చోడవరం: అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం డిసెంబర్ 2, 2014 న బుచ్చయ్య పేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన గంజాయి కేసులో నిందితులైన రోలుగుంట మండలం రత్నంపేట గ్రామానికి చెందిన పడాల నాగేశ్వరరావు, రోలుగుంట మండలం గుర్రాల పాలెం గ్రామానికి చెందిన గుర్రం నగేష్‌పై చోడవరం 9వ అదనపు జిల్లా జడ్జి మంగళవారం తీర్పు వెల్లడించారని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2014 డిసెంబర్ 2న బుచ్చయ్య పేట ఎస్సైకి రాబడిన సమాచారం మేరకు ఎస్సై కె.లక్ష్మణరావు సిబ్బందితో ఉదయం 8 గంటలకు బుచ్చయ్యపేట మండలం, రాజాం గ్రామ జంక్షన్ దగ్గరలో చెరుకు కాటా వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు అనుమానస్పద వ్యక్తులు ఏపీ 31 టీ డబల్యూ ఏపీ 1494 నెంబర్ గల ఆటోపై వస్తున్న వారిని తనిఖీ చేయగా అందులో 36 కేజీల గంజాయి ఉండగా పోలీసులు కేసు నమోదు చేసి నిందితులని అరెస్ట్ చేసి, దర్యాప్తు పూర్తి చేయగా ఎస్సై కె.లక్ష్మణరావు న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేశారన్నారు. ఈ కేసును జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో విచారణ జరపడం అయినది. తదుపరి విచారణ పూర్తయిన తర్వాత చోడవరం, 9వ అడిషనల్ సెషన్స్ జడ్జి కోర్టు న్యాయమూర్తి కె.రత్న కుమార్ ముద్దాయిలు అయిన పడాల నాగేశ్వరరావు, గురం నాగేస్ కు 10 సం.,లు కఠిన కారాగార శిక్ష మరియు రూ.1,00,000/- జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని, జరిమానా రూ.1,00, 000/- కట్టని ఎడల మరో రెండున్నర సం.ల జైల శిక్ష విధించనున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో పి.పి ఉగ్గిన వెంకట్రావు వారి వాదనలు సమర్థిస్తూ గౌరవ కోర్టు ఈ తీర్పును వెల్లడించడం జరిగిందన్నారు. జిల్లా ఎస్పీ దర్యాప్తు అధికారి అప్పటి బుచ్చేయ్యపేట ఎస్సై కె.లక్ష్మణరావు, వాదనలు వినిపించిన పీ.పీ ఉగ్గిన వెంకట్రావును బుచ్చేయ్యపేట పోలీస్ సిబ్బందిని అభినందించారు.

పలు ఆలయాల్లో ఏకాదశి పూజలు

విశాలాంధ్ర - యస్.రాయవరం: కార్తీక మాసం ఏకాదశి కావడంతో పలు ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. మంగళవారం మండలంలో యస్.రాయవరం వైభవ వెంకటేశ్వర స్వామి, బుర్రేశ్వర స్వామి ఆలయం, దార్లపూడి వెంకటేశ్వర స్వామి తెల్లవారు జామున నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు. ఎస్.రాయవరం బుర్రేశ్వర స్వామి గెడ్డ పాలెం చంద్రమౌళీశ్వర స్వామి ఆలయాల్లో ఏకాహం ఏర్పాటు చేయగా భజన బృందాలు భక్తి గీతాలు ఆలపించారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలి

విశాలాంధ్ర - కే.కోటపాడు: ప్రభుత్వ సూచనలను అనుసరించి మండల, గ్రామ పంచాయతీల్లో నిధులు ఖర్చు చేయవలసి ఉంటుందని ఎంపీడీవో సాంబశివరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్లు ఒకరోజు శిక్షణలో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లడమే కాకుండా, గ్రామ పంచాయతీల అభివృద్ధికి అధికారులందరూ పాటుపడాలన్నారు. పంచాయతీ నిధులకు సంబంధించి పారిశుధ్య నిర్వహణకు స్వీపర్‌ల వేతనాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అలాగే గ్రామీణ విద్యుత్తు త్రాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా ఉండాలని అన్నారు. పంచాయతీల రాబడి ఖర్చు విషయంలో కార్యదర్శులు పారదర్శకంగా ఉండాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ఎటువంటి సమస్యలు ఉండకూడదని, ఎప్పటికప్పుడు మండల స్థాయి అధికారులు పర్యవేక్షణ చేయవలసి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి ఎస్.అప్పలరాజు మాట్లాడారు.

నేడు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

విశాలాంధ్ర - పరవాడ: పరవాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (2025 - 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి) పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పంచాయతీ విస్తరణాధికారి ధర్మారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీలతో పాటు మండలంలోని ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఆయుష్ మిషన్లో ఆశా కార్యకర్తలకు శిక్షణ

విశాలాంధ్ర - కశింకోట: జాతీయ ఆయుష్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలకు శిక్షణ తరగతులు డాక్టర్ కుసుమకుమారి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు సాధారణ వ్యాధులతో పాటు మధుమేహం వ్యాధిపై అందించాల్సిన వైద్య సేవలపై ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఆయుష్ వైద్య విధానం పైఅవగాహన కలిగి ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ ప్రభుత్వ వైద్యాధికారి యు.రమేష్, ఎంపీహెచ్ఈఓ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగులో కాషాయాల తయారీపై అవగాహన

విశాలాంధ్ర - మాకవరపాలెం: జంగాలపల్లి గ్రామంలో రైతు అల్లు గోవింద సమక్షంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో బ్రహ్మాస్త్రం కషాయం చేయడం జరిగింది. ఇది కాయగూరలలో వంగ, బెండ, టమాటా పంటలలో వచ్చే కాయ తొలిచే పురుగు నివారణకు చాలా బాగా పనిచేస్తుంది అని ప్రకృతి వ్యవసాయ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు అభినందన

విశాలాంధ్ర - పరవాడ: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, భరణికం పరిధి బాపడుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కోరుపోలు గంగాధర్‌ను మాజీ సర్పంచ్ బొండా తాతారావు, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ దాట్ల గణేష్ రాజు అభినందించారు. మంగళవారం పాఠశాలలో గంగాధర్ దంపతులకు జ్ఞాపికను అందజేసి శాలువాతో సత్కరించారు. అంకితభావంతో విధులు నిర్వహించి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికకావడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని టి.రాజేశ్వరి. ఉపాధ్యాయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పంచాయతీ వార్డు మెంబర్లు, అంగన్వాడి టీచర్ రత్నం, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పంట బీమా చేయించుకోండి: ఏవో సౌజన్య

విశాలాంధ్ర - యస్.రాయవరం: వరి రైతులు పంట బీమాను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సౌజన్య సూచించారు. మంగళవారం మండలంలో దార్లపూడి, పెట్టుగోళ్లపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ పంటకు కావలసిన అపరాల విత్తనాలు వివరాలు తెలియజేయాలన్నారు. అదే విధంగా రబీ సీజన్ సంబంధించి పంట బీమా నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. వరి పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

సర్పంచులకు, ఎంపీటీసీలకు శిక్షణ తరగతులు

విశాలాంధ్ర - వి.మాడుగుల: పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కార్యాచరణ ప్రణాళిక శిక్షణ తరగతులు మంగళవారం మాడుగుల ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రాజారామ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈవోపీఆర్డీ కరుణాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకొని వెళ్లడం, అలాగే గ్రామ పంచాయతీలు ఏ విధంగా అభివృద్ధి చేయాలనే విషయాలపై ప్రభుత్వం రెండు రోజులు పాటు శిక్షణ తరగతులు ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసరావుతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: మండలంలోని విజయరామరాజుపేటలో మంగళవారం విశాఖ ఎల్వి ప్రసాద్ ఐ ఆసుపత్రి సహకారంతో స్థానిక వేగి మహాలక్ష్మి నాయుడు సారధ్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆప్తాలమిస్టులు సాయి, గౌరీ, శరత్,లక్ష్మీ ప్రియ, స్వాతి రోగులను తనిఖీ చేసి ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన వారిని గుర్తించి ఉచితంగా కంటి శాస్త్ర చికిత్సలు విశాఖలో చేయించేందుకు ఏర్పాటు చేశారు. కంటి సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. సర్పంచ్ యల్లపు విజయ్ కుమార్, క్యాంపు కోఆర్డినేటర్ స్వాములు ఫీల్డ్ అసిస్టెంట్లు భూపతి సంతోషి పాల్గొన్నారు.